# పురుగుల నియంత్రణలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి


**ఉనికిచెర్లలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేతల కార్యక్రమం**




**ధర్మసాగర్/, హనుమకొండ బ్యూరో మే 16 (జర్నలిస్ట్ వార్త):** రైతులు పంట సాగులో శాస్త్రీయ విధానాలను అనుసరిస్తేనే దిగుబడులు పెరిగి ఖర్చులు తగ్గుతాయని వ్యవసాయ శాస్త్రవేత యు. నాగభూషణం పేర్కొన్నారు. ధర్మసాగర్ మండలం ఉనికిచెర్ల గ్రామంలో వరంగల్ వ్యవసాయ కళాశాల, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన "రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేతలు" కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.
భూ పరీక్షా విధానం, పంటల పోషక పదార్థాల నిర్వహణ, పురుగుల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమి సారవంతత తగ్గిపోతుందని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. పంటల్లో పురుగుల నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు అమలు చేయాలని తెలిపారు.కీటక శాస్త్ర ఉపాధ్యాయురాలు రమ్యశ్రీ మాట్లాడుతూ జిగురు అట్టల వినియోగం ద్వారా పంటలను హానికర పురుగుల నుంచి రక్షించవచ్చని చెప్పారు. ప్రతి రైతు ఈ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.కార్యక్రమంలో ఏఈవో దివ్య, వ్యవసాయ కళాశాల విద్యార్థులు మోహనకృష్ణ, నారాయణమ్మతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు

# దేవాదుల పిల్ల కాలువల దుస్థితిపై బీజేపీ వినతి

**గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిన కాలువలు.. వర్షాకాలంపై గ్రామస్తుల ఆందోళన**




**ఎల్కతుర్తి, /మే16(జర్నలిస్ట్ వార్త:)**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని దేవాదుల పిల్ల కాలువలు, గొలుసుకట్టు కాలువలు గడ్డి, పిచ్చి మొక్కలు, పూడికతో నిండిపోవడంతో వర్షాకాలంలో ముంపు ప్రమాదం పొంచి ఉందని మండల బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల పునరుద్ధరణతో పాటు ముంపు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ మండల బీజేపీ అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ తహసీల్దార్ రవికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ మండలంలోని 20 గ్రామాల పరిధిలో ఉన్న గొలుసుకట్టు కాలువల వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందన్నారు. గతంలో చెరువుల నుంచి వచ్చే అదనపు నీరు ఈ కాలువల ద్వారా సాఫీగా వెళ్లేదని, ప్రస్తుతం ఆక్రమణలు, పూడిక పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహం నిలిచిపోతుందని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైతే లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.బావుల సమీపంలోని కెనాల్ కాలువలు, చిన్న పిల్ల కాలువలు పూర్తిగా పూడికతో నిండిపోయాయని, వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.వర్షాకాలం ప్రారంభానికి ముందే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి కాలువల పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని మండల ప్రజల తరపున విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కంచర్ల శంకరయ్య, ఆడెపు శ్రీవర్ధన్, కొడం రమేష్, మాటూరు విద్యాసాగర్, చీరాల రంజిత్, సుఖిన సుధాకర్, సూదిరెడ్డి సాయిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

# భూ వివాదంలో ఇరు వర్గాల ఘర్షణ

**కర్రలు, కత్తులతో దాడులతో పలువురికి గాయాలు**

**వరంగల్,మే16(జర్నలిస్ట్ వార్త:)**
వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సూర్యతండా పరిధిలోని మర్రి తండాలో ఇరువర్గాల మధ్య ఘర్షణ కలకలం రేపింది. గ్రామానికి చెందిన రమావత్ గ్యాస్య, రమావత్ రేఖ్య మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న భూవివాదం నేపథ్యంలో శుక్రవారం రాత్రి కర్రలు, కత్తులతో దాడులు చేసుకున్నారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనలో రమావత్ గ్యాస్య, రమావత్ రేఖ్యతో పాటు కిరణ్, రాజేందర్, నవీన్, జీవన్ సహా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘర్షణ గురించి సమాచారం అందుకున్న రాయపర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘర్షణకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# 22న నాటి మ్యాచ్ కోసం నకిలీ యాప్‌లు

**జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించిన సిపి**



**హైదరాబాద్,మే16(జర్నలిస్ట్ వార్త:)**మే 22న ఉప్పల్ వేదికగా జరగనున్న ఎస్ఆర్‌హెచ్, ఆర్సీబీ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్‌ను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మలచుకుంటున్నట్లు సీపీ సజ్జనార్ హెచ్చరించారు. 'సోషల్ మీడియా వేదికగా ఐపీఎల్ టికెట్ల బుకింగ్‌కు సంబంధించి అనేక ప్రకటనలు దర్శనమిస్తున్నాయి. అధికారిక టికెటింగ్ భాగస్వామి అయిన 'డిస్ట్రిక్ట్' యాప్‌ను పోలిన రంగులు, లోగోలతో ఉన్న నకిలీ యాప్‌లను సృష్టించి, తక్కువ ధరకే టికెట్లు ఇస్తామంటూ ఊరిస్తున్నారు. ఫేక్ యాప్స్‌తో తస్మాత్ జాగ్రత్త. మ్యాచ్ చూడాలనే ఉత్సాహంతో సోషల్ మీడియాలో వచ్చే అనధికార లింకులను నమ్మి మోసపోవద్దు. ఇలాంటి ఫేక్ యాప్స్, వెబ్‌సైట్లపై నిఘా ఉంచాం. ఎవరికైనా ఇలాంటి యాప్స్, వెబ్‌సైట్ల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి' అని సజ్జనార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

# బతుకుబాటలో నిబద్ధత..

## హెచ్చరిస్తున్న వర్తమానం



నమ్మకమే ప్రాణంగా బతికే లోకంలో, నమ్మకద్రోహమే పెద్ద శత్రువుగా మారడం నేటి సమాజంలో చూస్తున్న విషాదం. ప్రాణంగా ప్రేమించిన వారే శత్రువులుగా మారితే ఎలా తప్పించుకోవాలి? శత్రువులను పసిగట్టడం ఎలా? ఒక అందమైన అమ్మాయి జీవితంలో ఎలాంటి ఆలోచనలు ఉండాలి? ఎలాంటి స్నేహం అవసరం?' ఈ ప్రశ్నలు కేవలం ఒక వ్యక్తిగత ఆవేదనకు సంబంధించినవి కావు; నేటి యువతరం, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న మానసిక, సామాజిక సంఘర్షణలకు నిలువుటద్దాలు. ఈ గందరగోళ పరిస్థితుల్లో ఆత్మరక్షణకు, ఉన్నతమైన జీవితానికి కావలసిన విచక్షణా జ్ఞానాన్ని అలవర్చుకోవడం అత్యంతావశ్యకం.

**'ప్రాణ స్నేహితులే' శత్రువులైతే.. తప్పించుకోవడం ఎలా?**

ప్రేమించిన వారే శత్రువులుగా మారినప్పుడు గుండె పగిలినంత పనవుతుంది. కానీ, అక్కడ భావోద్వేగాలకు లోనైతే మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది.భావోద్వేగ దూరం. మిమ్మల్ని మానసికంగా గాయపరిచే వారి నుండి మొదట మానసికంగా, తర్వాత భౌతికంగా దూరంగా జరగండి. వారి మాటలను, బెదిరింపులను మీ మనసుకు తీసుకోకండి.
నిశ్శబ్ద వ్యూహం,శత్రువులతో వాదనలు, ప్రతిఘటనలు పెట్టుకోవడం కంటే మౌనంగా దూరం కావడం శ్రేయస్కరం. మీ తదుపరి అడుగు ఏంటో వారికి తెలియనివ్వకూడదు.
చట్టపరమైన, సామాజిక రక్షణ, ముప్పు పొంచి ఉందని తెలిసినప్పుడు భయపడి దాక్కోవడం పరిష్కారం కాదు. నమ్మకమైన కుటుంబ సభ్యులకు లేదా చట్టానికి, సమాచారం అందించి రక్షణ పొందాలి.

**శత్రువులను పసిగట్టడం ఎలా?**

ముసుగు వేసుకున్న శత్రువులను గుర్తించడం కష్టమే, కానీ వారి ప్రవర్తనను నిశితంగా గమనిస్తే సులువుగా పసిగట్టవచ్చు.
అతి వినయం.. ధూర్త లక్షణం: అవసరం లేకపోయినా అతిగా పొగడటం, మీ ప్రతి చిన్న విషయానికి అతిగా స్పందించడం శత్రువుల ప్రాథమిక లక్షణం.
అసూయను దాచలేరు, మీరు సాధించిన విజయాలకు వారు పెదవుల పైనుంచే నవ్వుతారు కానీ, వారి కళ్లల్లో ఆనందం కనిపించదు.
విషం చిమ్మే మాటలు, మీ వెనుక ఒకలా, మీ ముందు ఒకలా మాట్లాడే వారిని, మీ బలహీనతలను తెలుసుకోవడానికి ప్రయత్నించే వారిని రాబోయే శత్రువులు గా గుర్తించి అప్రమత్తం కావాలి.

**అందమైన అమ్మాయి జీవితం ఎలాంటి ఆలోచనలు అవసరం?**

రూపంలోనే కాదు, ఆలోచనల్లోనూ అందం ఉంటేనే ఆ జీవితానికి సార్థకత. బాహ్య సౌందర్యం కంటే అంతఃసౌందర్యం, ఆత్మవిశ్వాసం ముఖ్యం.
ఒక అమ్మాయి జీవితంలో అన్నిటికంటే ముఖ్యమైన ఆలోచన తన కాళ్ల మీద తను నిలబడటం. ఆర్థికంగా ఎవరిపైనా ఆధారపడనప్పుడు సగం సమస్యలు దరిచేరవు.
సమాజం చూసే చూపులకు, విసిరే విమర్శలకు కుంగిపోకూడదు. నా జీవితానికి నేనే బాధ్యురాలిని అనే స్పష్టమైన ఆలోచన, ధైర్యం కలిగి ఉండాలి. నచ్చని విషయాన్ని, ఇబ్బంది పెట్టే బంధాన్ని నిర్మొహమాటంగా తిరస్కరించే అలవాటు అమ్మాయిలకు చాలా అవసరం.

**ఎలాంటి స్నేహం అవసరం?**


స్నేహం అనేది జీవితాన్ని నిర్మించగలదు, లేదా సర్వనాశనం చేయగలదు. కాబట్టి స్నేహితుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేయాలి.
నిజాయితీ గల స్నేహం: మీ తప్పులను మొహం మీదే చెప్పి, మిమ్మల్ని సరైన బాటలో పెట్టే స్నేహితుడు కావాలి. ఆనందంలో పాలుపంచుకునే వారికంటే, మీరు మానసిక సంక్షోభంలో ఉన్నప్పుడు మీ చెయ్యి పట్టుకుని నడిపించే పరిణతి ఉన్న స్నేహం అవసరం. వ్యక్తిత్వాన్ని గౌరవించే, నైతిక విలువలు ఉన్న స్నేహితుల సావాసం మీ జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది. జీవితం అనేది ఒక నిరంతర యుద్ధం. ఇక్కడ నమ్మకాలూ ఉంటాయి, నమ్మకద్రోహాలూ ఉంటాయి. శత్రువుల పట్ల అప్రమత్తత, స్నేహితుల పట్ల విచక్షణ, మనోబలంతో కూడిన ఆలోచనలు ఉన్నప్పుడే ఏ వ్యక్తైనా ముఖ్యంగా మహిళలు తమ జీవితాన్ని సురక్షితంగా, అందంగా తీర్చిదిద్దుకోగలరు. భయపడటం బలహీనత.. ఎదిరించి నిలబడటమే జీవితం!



జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్

# అడుగుజాడల్లో నడవడం కాదు..

## సరికొత్త బాటలు వేయడమే గమ్యం.




పదిమంది వెళ్ళే దారిలో వెలితే అది ప్రయాణం అవుతుంది.. నీకంటూ ప్రత్యేకమైన దారిని సృష్టించుకొని వెళితే అది చరిత్ర అవుతుంది. సమాజంలో గమ్యం వైపు సాగే ప్రతి ఒక్కరి గుండెల్లో నిరంతరం ప్రతిధ్వనించాల్సిన సత్యమిది. పుట్టిన ప్రతి మనిషీ జీవిస్తాడు, కాలగర్భంలో కలిసిపోతాడు. కానీ, కొందరు మాత్రమే శతాబ్దాలు దాటినా నిలిచిపోయే ఇతిహాసాలుగా మారుతారు. కారణం
వారు ఇతరులు వేసిన దారిలో నడవలేదు, ఎవరికీ సాధ్యం కాని సరికొత్త దారులను వారే నిర్మించుకున్నారు.

**ప్రయాణం సుఖమయం.. కానీ చరిత్ర సాహసోపేతం**

సమాజం నిర్దేశించిన చట్రంలో, అందరూ నడిచే సురక్షితమైన దారిలో వెళ్లడం చాలా సులభం. అందులో సవాళ్లు తక్కువ, ప్రమాదాలూ తక్కువే. కానీ, అలాంటి పయనం కేవలం ఒక 'ప్రయాణం'గానే మిగిలిపోతుంది. ఆ దారిలో సాగిన వారి పేర్లు కాలక్రమేణా తుడిచిపెట్టుకుపోతాయి. ఒక అంబేద్కరో, ఒక అబ్దుల్ కలామో, ఒక సావిత్రీబాయి పూలేనో ఆనాటి సమాజం చూపిన సాధారణ దారిలో నడిచి ఉంటే. నేడు మనం అనుభవిస్తున్న ఈ చైతన్యం ఉండేదా? వారు ఎదురీదారు, ముళ్ల బాటలను తొక్కారు, తమకంటూ ఒక ప్రత్యేక మార్గాన్ని సృష్టించుకున్నారు కాబట్టే నేడు చరిత్ర పుటల్లో వెలుగులవుతున్నారు.

**ప్రత్యేక గుర్తింపు ఆలోచనల నుంచే ఆరంభం**

సరికొత్త దారిని సృష్టించడం అంటే సమాజానికి దూరంగా జరగడం కాదు; సమాజ హితం కోసం సరికొత్తగా ఆలోచించడం. అందరూ ఒకే వైపు వెళు_న్నప్పుడు, ఒంటరిగా ఇంకోవైపు అడుగులు వేయడానికి అపరిమితమైన గుండెధైర్యం కావాలి. నా ఆలోచన సరైనదే అనే నమ్మకమే ఆ అడుగులకు ఇంధనం అవుతుంది.
కొత్త దారిలో వెళ్లేటప్పుడు అడ్డంకులు, విమర్శలు, అవమానాలు ఎదురవ్వడం సహజం. వాటిని చూసి వెనకడుగు వేయకుండా, ఆ అనుభవాలనే ఇటుకలుగా మార్చుకుని విజయసౌధాన్ని నిర్మించాలి.

**నేటి యువతరం అనుకరణ కాదు.. ఆవిష్కరణ కావాలి!**

నేటి డిజిటల్ యుగంలో దురదృష్టవశాత్తూ అనుకరణ ఎక్కువైపోతోంది. ఎవరో చేసిన పనిని తామూ చేస్తూ, ఆ గుంపులో ఒకరిగా మిగిలిపోవడానికి యువత ప్రాధాన్యత ఇస్తోంది. కానీ, వర్తమాన ప్రపంచం కోరుకుంటోంది అనుకర్తలను కాదు.. సృష్టికర్తలను. మీలోని ప్రత్యేక నైపుణ్యం ఏంటో గుర్తించండి. లోకం ఏమనుకుంటుందో అనే భయాన్ని వీడి, మీ అభిరుచికి అనుగుణంగా సరికొత్త ప్రయోగాలు చేయండి సాంకేతికత, వ్యాపారం, కళలు, సామాజిక సేవ. రంగం ఏదైనా సరే, గతంలో ఎవరూ అడుగుపెట్టని సరిహద్దులను దాటి ముందుకు సాగండి.
అడుగుజాడల్లో నడవడం కాదు.మనమే అడుగుజాడలు విడిచి వెళ్లడం ముఖ్యం. గొర్రెల మందలా గుంపులో సాగిపోవడం తాత్కాలిక రక్షణను ఇవ్వచ్చేమో కానీ, శాశ్వత కీర్తిని ఇవ్వలేదు. వినూత్న ఆలోచనలతో, దృఢ సంకల్పంతో మీకంటూ ఒక. ప్రత్యేక మార్గాన్ని సృష్టించుకోండి. అప్పుడే మీ జీవితం కేవలం ఒక సాధారణ ప్రయాణంగా ముగిసిపోకుండా. తరతరాలకు స్ఫూర్తినిచ్చే ఒక మహోజ్వల చరిత్ర గా మారుతుంది.



జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్

